క్లుప్తంగా

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరే కృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

ప్రధాన పూజారి అస్తమయం



సత్యారావు (ఫైల్)

భీమునిపట్నం: భీమిలి గ్రామదేవత నూకాలమ్మ ఆలయ వంశపారంపర్య ప్రధాన పూజారి, ధర్మకర్త చొదరి సత్యారావు (79) ఆదివారం మృతి చెందారు. నిత్యం అమ్మవారి సేవలో ఉండడంతో భక్తుల వద్ద ఆయన మంచి గుర్తింపు పొందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ చనిపోయారు. ఆయన మృతి పట్ల ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ 3వ వార్డు ఇన్‌చార్జి మైలిపల్లి షణ్ముఖరావు, పలువురు రాజకీయ నాయకులు, ప్రముఖులు, పెద్దలు సంతాపం తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ నుంచి పొగలు



పొగలు కక్కుతున్న ట్రాన్స్‌ఫార్మర్

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు జగ్గారావు తోట సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఆదివారం ఒక్కసారిగా పొగలు వచ్చాయి. ఇక్కడ ఇటీవల ట్రాన్స్‌ఫార్మర్ కొత్తగా ఏర్పాటు చేశారు. దీనికి ఎటువంటి కనెక్షన్లు ఇవ్వకపోయినప్పటికీ పొగలు వ్యాపించడానికి గల కారణాలు తెలియరాలేదు.

6న టీఎస్సార్ కల్యాణ మండపం లీజు వేలం

తగరపువలస: బైపాస్‌రోడ్డులోని సుబ్బిరామిరెడ్డి కల్యాణ మండపాన్ని వ్యాపార అవసరాల నిమిత్తం ఈ నెల 6న స్థానిక వర్తక సంఘం వేలం వేయనుంది. సాయంత్రం 4 గంటలకు వేలం వేసే సమయంలో నిబంధనలు తెలియజేయనున్నారు. ఆసక్తి గల వారు వేలంలో పాల్గొనాలని వర్తకసంఘం ప్రతినిధులు కోరారు.

విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు మృతి



సూర్యనారాయణ మూర్తి (ఫైల్)

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు కె.నగరపాలెంకు చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు మహంతి సూర్యనారాయణమూర్తి (82) అనారోగ్యంతో ఆదివారం ఉదయం మృతి చెందారు. ఇక్కడి ప్రభుత్వ పాఠశాలలో సుమారు 35 సంవత్సరాలు అనేక మందికి విద్యాబుద్ధులు నేర్పిన గురువు మృతి చెందడం స్థానికులను కలిచివేసింది. వార్డు కార్పొరేటర్ దొంలపల్లి కొండబాబు, తదితరులు సంతాపం తెలిపారు.

పరీక్ష కేంద్రాల పరిశీలన

సింహాచలం: పెందుర్తి మండలంలో పదో తరగతి పరీక్షలు నిర్వహించే పలు కేంద్రాలను డీఈవో చంద్రకళ ఆదివారం పరిశీలించారు. పెందుర్తి ప్రభుత్వ హైస్కూల్, గుర్రంపాలెం, సరిపల్లి జిల్లా పరిషత్ హైస్కూళ్లను ఆమె సందర్శించారు. ఆయా కేంద్రాల్లో ఏవిధంగా ఏర్పాట్లు చేశారో స్వయంగా పరిశీలించారు. ప్రతీ కేంద్రంలో విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసినట్టు ఆమె చెప్పారు.

‘పది’ పరీక్షలకు పక్కా ఏర్పాట్లు



పరీక్ష కేంద్రం ఏర్పాటు చేసిన శొంఠ్యాం ఉన్నత పాఠశాల



పరీక్ష కేంద్రం కేటాయించిన చిట్టివలసలోని అంబేడ్కర్ జీవీఎంసీ హైస్కూల్

తగరపువలస: నియోజకవర్గంలో సోమవారం నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు సంబంధించి అధికారులు పక్కాగా ఏర్పాట్లు చేశారు. భీమిలి మండలంలో 12 పరీక్షా కేంద్రాలను కేటాయించారు. మొత్తం 41 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 2,731 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. వీరిలో ఇంగ్లిష్ మీడియంకు సంబంధించి 1,108 మంది బాలురు, 1,000 మంది బాలికలు ఉన్నారు. తెలుగు మీడియంలో పరీక్ష రాసే విద్యార్థుల్లో 311 మంది బాలురు, 312 మంది బాలికలు ఉన్నారు. ఒకేషనల్‌తో కలిసి ఈ 18 వరకు పరీక్షలు రోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు జరగనున్నాయి. ఫస్ట్ లాంగ్వేజ్‌లో 30 మార్కుల కాంపోజిట్ పరీక్షకు సంబంధించి ఈ నెల 17న ఉదయం 9.30 నుంచి 11.15 వరకు, ఒకేషనల్ థియరీ పరీక్ష 18న ఉదయం 9.30 నుంచి 11.30 వరకు జరుగుతుంది.

పరీక్షా కేంద్రాలు ఇవే...

చిట్టివలస శారద పబ్లిక్ స్కూల్, చిట్టివలస జెడ్పీ హైస్కూల్, సంగివలస శశి ఇంగ్లిష్ మీడియం స్కూల్, తాళ్లవలస జెడ్పీ హైస్కూల్, చిట్టివలస జెడ్పీ బాలికల హైస్కూల్, చిట్టివలస అంబేడ్కరు జీవీఎంసీ హైస్కూల్, భీమిలి సెయింటాన్స్ గరల్స్ ఎయిడెడ్ హైస్కూల్, భీమిలి గవర్నమెంట్ హైస్కూల్, భీమిలి పండిట్ నెహ్రూ జీవీఎంసీ హైస్కూల్, భీమిలి ఏపీ రెసిడెన్షియల్ గర్ల్స్ హైస్కూల్, భీమిలి పొట్టి శ్రీరాములు జీవీఎంసీ హైస్కూల్, మంగమారిపేట జెడ్పీ హైస్కూల్.

సజావుగా నిర్వహణకు సహకరించాలి

పద్మనాభం: మండలంలోని నాలుగు కేంద్రాల్లో సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు సహకరించాలని సీఐ ఎస్.సన్యాసినాయుడు కోరారు. మద్ది, పద్మనాభం, రెడ్డిపల్లి, ఆర్.వి.పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారన్నారు. ఈ కేంద్రాల వద్ద అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. ఈ కేంద్రాల పరిసర ప్రాంతాల్లో గుంపులుగా గుమిగూడి ఉండకూడదన్నారు. విద్యార్థులకు ఇబ్బంది కలిగించేలా లౌడ్ స్పీకర్లు పెట్టకూడదన్నారు. కేంద్రాల పరిసరాలకు దగ్గరలో జిరాక్సు షాపులు నిర్వహించకూడదన్నారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా కేంద్రంలోకి విద్యార్థులను అనుమతించేది లేదన్నారు. తప్పనిసరిగా హాల్ టికెట్ పట్టుకుని రావాలని కోరారు.

ఆనందపురం : మండలంలో ఐదు పరీక్షా కేంద్రాల్లో సోమవారం నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. శొంఠ్యాం, బోయిపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, పెద్దిపాలెం నారాయణ ఉన్నత పాఠశాలలో ఒక్కొక్క కేంద్రం, ఆనందపురం ఉన్నత పాఠశాలలో రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. 12 ప్రభుత్వ పాఠశాలల నుంచి 811 మంది, 13 ప్రైవేటు పాఠశాలల నుంచి 1,427 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. ఈ మేరకు ఆయా పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్ విధించారు.

చంద్రంపాలెం హైస్కూల్లో 2 కేంద్రాలు

మధురవాడ: విశాఖ రూరల్ మండలం పరిధిలో పదో తరగతి పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు చేశారు. మండలంలో 26 కేంద్రాలు ఏర్పాటు చేయగా 5,909 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు.

మధురవాడ పరిసర ప్రాంతాల్లో 12 కేంద్రాలు ఏర్పాటు చేశారు. చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2 కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు అధికారులు చెప్పారు. ఇప్పటికే పరీక్ష పత్రాలు ఆయా పోలీస్ స్టేషన్లలో భద్రపరిచారు. కేంద్రాల వద్ద స్వచ్ఛంద సంస్థల సహకారంతో మజ్జిగ చలివేంద్రాల ఏర్పాటుకు అధికార యంత్రాంగం ప్రయత్నాలు చేస్తోంది. తాగునీరు, ఫ్యాన్లు ఏర్పాటు చేశారు.



చంద్రంపాలెం హైస్కూల్‌లో ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

సేవతోనే మానసిక ప్రశాంతత



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న సంస్థ సభ్యులు

కొమ్మాది: యోగాతో మనిషికి శారీరక ప్రశాంతత చేకూరితే, సేవతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఓం యోగా శిక్షణ కేంద్ర వ్యవస్థాపక నిర్వాహకులు చిలక వెంకట రమేష్ అన్నారు. భీమిలి బీచ్ రోడ్డు మంగమారిపేట వారిజా నేత్ర విద్యాలయంలో సంస్థ తరఫున సేవా కార్యక్రమాలు ఆదివారం ప్రారంభించారు. సంస్థ ద్వారా ఇప్పటికి నగరంలో 4వేల మందికి పైగా ఉచిత యోగా శిక్షణ అందిస్తున్నామని, ఇక నుంచి యోగాతోపాటు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. శ్మశానాల్లో శుభ్రత, రక్తదానాలు, నిరుపేద పిల్లలకు చదువుతోపాటు పుస్తకాల పంపిణీ వంటి కార్యక్రమాలు నిర్వహించబోతున్నట్లు తెలిపారు.

ఇందులో భాగంగా ఇక్కడి విద్యార్థులకు అన్నదానం, పండ్లు, దుప్పట్లు, పుస్తకాలు, పాఠశాలకు ఫ్యాన్లు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు శాంతారామ్, ఏయూ యోగా డైరెక్టర్ బానుకుమార్, మాజీ వీసీ రామకృష్ణ, పాఠశాల ప్రిన్సిపాల్ శిరీష, బోధి ధర్మ అవార్డు గ్రహీత వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

నివాసాల మధ్య మురుగుకూపం



నివాసాల మధ్య ఉన్న మురుగునీరు

ఆనందపురం : మండలంలోని వేములవలసకు సమీపంలో సర్వీసు రోడ్డు పక్కన మురుగుకూపం ఏర్పడడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఆనందపురం జంక్షన్ నుంచి ఫ్లైఓవర్ వరకూ సర్వీసు రోడ్డు నిర్మించారు. అయితే రోడ్డు పక్కన నిర్మించిన సిమెంట్ కాలువను అసంపూర్తిగా వదిలేశారు. దీంతో అక్కడి ఖాళీ ప్రదేశంలోకి నివాస ప్రాంతాల నుంచి వచ్చే వాడుక నీరు చేరుతోంది. ఆ నీరు ఎటూ పోయే మార్గం లేక అక్కడే నిల్వ ఉండిపోవడంతో మురుగుకూపంగా మారింది. అలాగే వర్షం కురిస్తే వరదనీరు అక్కడికే చేరి చెరువులా తయారవుతోంది. దీంతో దోమలు, ఈగలు వృద్ధి చెందుతున్నాయి. దుర్వాసన భరించలేకపోతున్నామని, రోగాలు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

డ్రైనేజీల్లోకి సెప్టిక్ ట్యాంకుల వ్యర్థాలు



చిట్టివలసలో సెప్టిక్ ట్యాంకు వ్యర్థాలు మోటారుతో తోడించి డ్రైనేజీలోకి వదులుతున్న దృశ్యం

తగరపువలస: వినియోగంలో ఉన్న సెప్టిక్ ట్యాంకులు నిండిన తర్వాత ఇరుగుపొరుగు వారికి ఇబ్బంది లేకుండా సెప్టీ క్లీనర్ల సాయంతో వ్యర్థాలను తోడించి నివాసాలకు దూరంగా పారవేయాలి. ఇప్పటి వరకు ప్రతిచోటా ఇదే పద్ధతి అమలులో ఉంది. దీనికిగాను సెప్టీ క్లీనర్ల నిర్వాహకులు లోడుకు నిర్ణీత మొత్తాన్ని వసూలు చేస్తారు. తర్వాత ట్యాంకు నుంచి దుర్వాసన రాకుండా రసాయనాలు, గ్యాస్ వంటివి వినియోగిస్తారు. దీనికిగాను టాంకుల సామర్థ్యాన్ని బట్టి రూ.10 వేల నుంచి రూ.40 వేల వరకు చార్జ్ చేస్తున్నారు. దీనికి ఇంత మొత్తం ఖర్చు వృథా అనుకున్నారో ఏమో ఇటీవల పలువురు నిండిన సెప్టిక్ ట్యాంకులను నీళ్లు తోడే మోటార్లతో సొంతంగా తోడుకుంటున్నారు. పాత మోటార్లు కొనుగోలు చేసి లీటర్ డీజిల్‌తో ట్యాంకుల నుంచి వ్యర్థాలు తోడి ఇంటి పక్కనే ఉన్న డ్రైనేజీలోకి వదులుతున్నారు. దీంతో వీధంతా దుర్వాసనతో ముక్కుపుటాలు అదిరిపోతున్నాయి. ఈ వ్యర్థాలు ప్రవహించే కిలోమీటర్ల మేరకు డ్రైనేజీ చుట్టూ ఉంటున్నవారు తలుపులు మూసుకుని ఉంటున్నారు. ఇటీవల చిట్టివలసలో ఒక గృహ యజమాని ఇదే విధంగా సొంతంగా తోడిన వ్యర్థాలు నేరుగా చిల్లపేట పెద్ద చెరువులో చేరిపోయాయి. గుర్తు తెలియని వ్యక్తుల ఫిర్యాదు మేరకు భీమిలి శానిటరీ సిబ్బంది స్పందించారు. ట్యాంకుల నుంచి నేరుగా వ్యర్థాలు డ్రైనేజీల్లోకి వదలడం ద్వారా అంటువ్యాధులు ప్రబలుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి వారిని గుర్తించి రూ.20వేల వరకు జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.

రోడ్డుపై మురుగునీటితో ఇబ్బందులు



పాండ్రంగిలో రోడ్డుపై నిలిచిన మురుగునీరు

పద్మనాభం: మండలంలోని పాండ్రంగి రాజవీధిలో కాలువలు లేకపోవడంతో ఇళ్లలోని వాడుకనీరు అంతా రోడ్డుపై ప్రవహించడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు మురికికూపంగా తయారవడంతో రాకపోకలు సాగించడానికి స్థానికులు అవస్థలు పడుతున్నారు. మురికి నీటిలో నడవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపైకి మురుగునీరు రాకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఫ్లైఓవర్ కింద సుందరీకరణ పనులు



ఫ్లైఓవర్ కింద చదును చేసిన భాగం



ఫ్లైఓవర్ కింద నాటిన మొక్కలు

ఆనందపురం : ఆనందపురం జంక్షన్‌లో ఫ్లైఓవర్ కింద ఖాళీగా ఉన్న స్థలాన్ని సుందరంగా తీర్చిదిద్దడానికి అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు ఆ ప్రాంతాన్ని చదును చేస్తున్నారు. ఇక్కడ ఫ్లై ఓవర్ స్తంభాల చుట్టూ విశాలమైన ఖాళీ ప్రదేశం ఉంది. ఎగుడుదిగుడుగా పిచ్చి మొక్కలతో ఉన్న ఆ ప్రాంతాన్ని వాహనాల పార్కింగ్‌కు, పువ్వులు, కోళ్ల విక్రయాలకు వినియోగిస్తున్నారు. దీని వల్ల క్రయవిక్రయదారులు అటూఇటూ సంచరించడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. దీంతో ఆ ప్రాంతాన్ని అందంగా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుంటున్నారు. చదును చేసి ముందుగా ఎత్తుగా పేరిగే మొక్కలను నాటుతున్నారు. అనంతరం ఆ ప్రాంతమంతా పూల మొక్కలు నాటనున్నారు. దీంతో ఆ ప్రదేశం అందమైన పూల తోటగా మారనుంది. వాహన చోదకులకు ఆహ్లాదాన్ని పంచనుంది.

ఇడదాసరిపేట రహదారికి మరమ్మతులు



స్థానికులు తాత్కాలికంగా నిర్మిస్తున్న రోడ్డు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ 2వ వార్డు ఇడదాసరిపేటలో స్థానికులు ఆదివారం తాత్కాలికంగా రహదారిని నిర్మించుకున్నారు. సుఖీభవ కాలనీ రహదారి నుంచి వలందపేటకు అనుసంధానించే రహదారి గోతులమయం కావడంతో వర్షాకాలంలో ఇబ్బంది పడుతుండేవారు. ఈ మార్గంలో అపార్ట్‌మెంట్ల నిర్మాణం చేపట్టిన వారు కూడా రహదారి నిర్మించాల్సి ఉన్నా విస్మరించారు. దీంతో అపార్ట్‌మెంట్ వాసులు మెటీరియల్ తీసుకొచ్చి తాత్కాలికంగా రహదారి నిర్మించుకుంటున్నారు.

ప్లాట్‌ఫారం నిర్మించాలని వినతి



పూడికపోయిన బోరు బావి ప్రాంతం

పద్మనాభం: మండలంలోని పాండ్రంగి జంక్షన్‌లోని బోరు బావి ప్లాట్‌ఫారం శిథిలమైంది. దీంతో బోరు ఉన్న ప్రాంతమంతా మట్టితో పూడిక పోయింది. పట్టుకున్న ప్రాంతం వద్ద నీరు నిల్వ ఉండిపోతోంది. మురికి నీటిలో బిందెలు పెట్టి తాగు నీరు పట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ప్లాట్‌ఫారం శిథిలమై ఏడాది కావస్తున్నా పట్టించుకున్న వారే కరువయ్యారని ప్రజలు మండిపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పూడిక తొలగించి ప్లాట్‌ఫారం నిర్మించేందుకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కనులపండువగా శ్రీరామ నవమి ఉత్సవాలు



తారక రామ యజ్ఞం నిర్వహిస్తున్న పండితులు

ఆనందపురం : మండలంలోని గంభీరంలో ఉన్న వైకుంఠ మందిర నిర్మాణ ప్రదేశంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీరామ నవమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగవంతుని అష్టోత్తర దివ్య నామాలను పఠించి తారక రామ యజ్ఞం నిర్వహించారు. భవబంధాల నుంచి విముక్తి చేసే శక్తి తారక రామ మంత్రానికి ఉందని పండితులు వివరించారు. రామాయణంలోని ఆరు ముఖ్య ఘట్టాలను, శ్రీరామ నామ ప్రాముఖ్యతను హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు నిష్కించిన భక్తదాస భక్తులకు వివరించారు. ఈ సందర్భంగా సీతా రామచంద్రులకు దూప దీప నైవేద్యాలు సమర్పించి పూజలు చేశారు. కార్యక్రమంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధి యదురాజా దాస, వివిధ గ్రామాల నుంచి భక్తులు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు జగతికి ఆదర్శం



మట్టల ఆదివారం సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

పీఎం పాలెం : మట్టల ఆదివారం పర్వదినం సందర్భంగా ఈ ప్రాంత క్రైస్తవులు ఆదివారం ఊరేగింపు నిర్వహించారు. స్థానిక ట్రినిటీ లూథరిన్ చర్చి ఆధ్వర్యంలో సాగిన ర్యాలీ మిథిలాపురి వుడా కాలనీ మీదుగా కారుషెడ్ కూడలి వరకూ సాగింది. ఈ సందర్భంగా చర్చి ఫాదర్ పి.ప్రసాదరావు మాట్లాడుతూ కరుణామయుడు ఏసుక్రీస్తు శాంతికి ప్రతిరూపం అన్నారు. ఆ మహనీయుని బోధనలు జగతికి ఆదర్శం అన్నారు. నిశ్శబ్దంగా సాగిన ర్యాలీలో వందలాది మంది క్రైస్తవులు పాల్గొన్నారు.

1, 2 వార్డుల సచివాలయాల కన్వీనర్‌గా జగుపల్లి



జగుపల్లి ప్రసాద్‌ను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ 1, 2 వార్డుల సచివాలయాల వైఎస్సార్‌సీపీ కన్వీనర్‌గా మాజీ కౌన్సిలర్, ఒకటో వార్డు అధ్యక్షుడు జగుపల్లి ప్రసాద్ నియమితులయ్యారు. ఈ రెండు వార్డుల్లో 10 వార్డు సచివాలయాల్లోని 30 మంది కన్వీనర్లకు ప్రసాద్ కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు. తనకు అప్పగించిన బాధ్యతల్లో భాగంగా ప్రతీ ఇంటికి వైఎస్సార్‌సీపీ ఆశయాలు, సీఎం జగనన్న సంక్షేమ, అభివృద్ధి పథకాలపై సమన్వయంతో ప్రచారం చేస్తామన్నారు. తనకు ఈ బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, ప్రోత్సహించిన 1వ వార్డు కార్పొరేటర్ అక్కరమాని పద్మ, పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, 2వ వార్డు ఇన్‌చార్జి శిల్లా సరశారాణి, ఎస్.కరుణాకరరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం భీమిలిలోని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు క్యాంప్ కార్యాలయంలో 2వ వార్డు అధ్యక్షుడు చిల్ల భాస్కరరెడ్డి, మాజీ కౌన్సిలర్లు ఉప్పాడ నాగేశ్వరరావు, జీవీ రమణ, సీనియర్ నాయకులు బింగి హరికిరణ్‌రెడ్డి, గండ్రేటి ఈశ్వరరావు, కుంచా శివరామకృష్ణ, తమ్మిన నరసింగరావు, మునకాల ఆదినారాయణరెడ్డి, పందిరి విజయ్, రొక్కం శ్రీను, సరగడ శివాంజనేయరెడ్డి, దెక్కతి శ్రీనివాసరెడ్డి తదితరులు ప్రసాద్‌ను అభినందించారు.

పెరుగుతున్న మట్టి పాత్రల వినియోగం



శిల్పారామంలోని గాంధీ బజారులో విక్రయానికి ఉంచిన టెర్రకోట కుండలు

పీఎం పాలెం: మట్టిపాత్రలకు మరలా పూర్వ వైభవం వస్తోంది. రాగి, స్టీలు, ఇత్తడి, అల్యూమినియంతో తయారు చేసిన పాత్రల వినియోగం కొన్నేళ్లుగా అధికమయింది. దీంతో మట్టికుండలు తెరమరుగయ్యాయి. గత తరంలో ప్రధాన గ్రామీణ వృత్తుల్లో కుండల తయారీ వృత్తి ఒకటి. పెద్దపెద్ద జాడీలు మొదలుకుని అన్నం వండడానికి కుండల వరకూ వివిధ సైజులలో ప్రత్యేకంగా పాత్రలు తయారు చేసేవారు. అయితే ఆధునిక యువతకు మట్టికుండల వినియోగం, తయారీపై కనీస అవగాహన శూన్యం. ఈ క్రమంలో ప్రస్తుతం మట్టి కుండల్లో వండిన ఆహార పదార్థాలు తింటే ఆరోగ్యపరంగా ఎంతో మంచిదని డాక్టర్లు, ప్రకృతి ఆరోగ్య అభిలాషులు, పలువురు నిపుణులు చెప్పడంతో మరలా ప్రజల దృష్టి మట్టి పాత్రల వైపు మరలింది. దీంతో వాటి తయరీ, అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ముఖ్యంగా టెర్రకోట మట్టి పాత్రలకు ప్రపంచ వ్యాప్తంగా మంచి డిమాండ్ ఉంది. వినియోగదారుల అవసరాలు గుర్తించి మట్టి పాత్రలు తయారు చేసి విక్రయిస్తున్నామని శిల్పారామంలోని స్టాల్ నిర్వాహకులు తెలిపారు.

విద్యార్థులకు పరీక్షల మెటీరియల్ పంపిణీ



పరీక్షల మెటీరియల్ అందిస్తున్న ఆదర్శ హిందీ ప్రేమీ మండలి ప్రతినిధులు

తగరపువలస: భీమిలిలోని పొట్టి శ్రీరాములు జీవీఎంసీ హైస్కూల్‌లోని 53 మంది పదో తరగతి విద్యార్థులకు ఆదర్శ హిందీ ప్రేమీ మండలి ఆధ్వర్యంలో రూ.6 వేల విలువైన పరీక్షా మెటీరియల్, స్వీట్లు ఆదివారం పంపిణీ చేశారు. అలాగే ఇటీవల ఎన్ఎమ్ఎమ్ఎస్‌కు ఎంపికైన 8వ తరగతి విద్యార్థి సాయికృష్ణకు బహుమతి అందించారు. ఈ సందర్భంగా మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు మాట్లాడుతూ జీవీఎంసీ భీమిలి జోన్ పరిధిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సత్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు గంటా నూకరాజు, ప్రధానోపాధ్యాయుడు చెట్టి సింహాచలం, ఉపాధ్యాయులు ఎ.నయాముద్దీన్, ఎస్.సుజాతకుమారి, అల్లాడ శ్రీనివాసరావు, ఇమంది వెంకటరావు, ఆల్తి రామకృష్ణ, కె.టి.వి.లక్ష్మి, ఎం.రామకృష్ణ, సీహెచ్ అశోక్, వైవీ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.